అద్దె భవనాలే దిక్కు

- పక్కా భవనాలు లేని కార్యాలయాలు
- మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం
- ఇబ్బందుల్లో మండల ప్రజలు



పాత జీపీ భవనంలో పోలీస్‌స్టేషన్



శిథిలావస్థలో ఎంఈవో కార్యాలయం

వీర్నపల్లి: పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏర్పడిన వీర్నపల్లి మండలంలో ఇప్పటికీ ఒక్క ప్రభుత్వ కార్యాలయం నిర్మించలేదు. మండల ప్రజలకు పాలన మరింత చేరువకావడానికి రాష్ట్ర ప్రభుత్వం 2016లో కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేసింది. వాటిలో వీర్నపల్లి మండలం ఒకటి. 17 గ్రామ పంచాయతీలున్న ఈ మండల కేంద్రంలో ప్రతి మూడు మాసాలకు ఒకసారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు అధికారులకు అవస్థలు పడుతున్నారు. తహసీల్దార్, మండల అభివృద్ధి, వ్యవసాయ శాఖ, ఉపాధి హామీ, సెస్ కార్యాలయాలతో పాటు మిగతా కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేకపోయారు.

ఊరికి దూరంగా..

తహసీల్దార్ కార్యాలయాన్ని తాత్కాలికంగా ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. అయితే ఇటీవల పాఠశాల భవనాలను కూల్చివేసి వాటి స్థానంలో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు.దీంతో తహసీల్దార్ కార్యాలయం ఊరికి దూరంగా ఒక అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య కొనసాగుతోంది.

పాత పంచాయతీ భవనంలో..

మండలం ఏర్పడినప్పటి నుంచి పాత గ్రామపంచాయతీ భవనంలోనే పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. పాత భవనం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉంది.

మండల సభలు హైస్కూల్‌లో

మండల వనరుల కేంద్రంలోనే మండల అభివృద్ధి కార్యాలయం ఏర్పాటు చేశారు. సర్వసభ్య సమావేశానికి మోడల్ స్కూల్ లేదా జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్నారు. ఆ రోజు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తిప్పలు తప్పడం లేదు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎంఈవో సంతకం కోసం ఎల్లారెడ్డిపేట మండల వనరుల కేంద్రానికి పరుగులు తీయాల్సిందే. మండలం ఏర్పడితే ఇలాంటి ఇబ్బందులు తప్పుతాయని భావించినా తిప్పలు తప్పలేదని వాపోతున్నారు.

చలనం లేదు



మండలం ఏర్పాటు అయినప్పటి నుంచి ప్రతి సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదు. నిరసన తెలిపిన ఫలితం లేదు. .

– మల్లారపు అరుణ్‌కుమార్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు

త్వరలో నిర్మిస్తాం



మండలంలో నూతన భవనాల నిర్మాణాల్లో జాప్యం జరిగింది వాస్తవమే. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మంజూరు కాగానే నిర్మాణాలు చేపడుతాం. – మాలోత్ భూల, ఎంపీపీ, వీర్నపల్లి

క్లుప్తంగా

రోడ్డు పనులు పూర్తి చేయాలని రిలే దీక్ష



రిలే దీక్షలో కూర్చున్న ఎంపీటీసీ, గ్రామస్తులు

ఇల్లంతకుంట: మండలంలోని రేపాక నుంచి చిన్నకోడూర్ మండలం కిష్టాపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం ప్రారంభించాలని ఎంపీటీసీ కథ సుమలత ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం రిలే నిరాహారదీక్ష చేశారు. కాంట్రాక్టర్ ఆరు నెలల క్రితం కంకర రోడ్డుపై పోసి వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే రైతులకు ఇబ్బంది అవుతోందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ రిలే దీక్ష చేపట్టిన ఎంపీటీసీ, గ్రామస్తులతో మాట్లాడుతూ ఈనెల 25 నుంచి రోడ్డు పనులు ప్రారంభిస్తానని హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు.

సఖి సేవలపై అవగాహన



మాట్లాడుతున్న రోజా

సిరిసిల్లఅర్బన్: స్థానిక సాయిశ్రీ జూనియర్ కళాశాలలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సఖీ సేవలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సఖి సెంటర్ నిర్వాహకురాలు బోనాల రోజ హాజరై మహిళల రక్షణ, చట్టాలు తదితర అంశాల గురించి వివరించారు. సైబర్ నేరాలు, బాల కార్మిక నిర్మూలన, బాల్యవివాహాలు తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. 24 గంటలు సఖి సెంటర్ నిర్వాహకులు అందుబాటులో ఉంటారని ఆపద సమయంలో 181 టోల్ ఫ్రీ నెంబర్‌కి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్, ఇల్లందుల ప్రకాశ్, సఖీ సెంటర్ కౌన్సిలర్ కళావతి, ప్రిన్సిపాల్ తిరుపతి, బీసీ విద్యార్థి సంఘం నాయకులు సుజిత్‌కుమార్, వంశీ పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింపజేయాలి

వీర్నపల్లి: అసెంబ్లీ సమావేశాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఉపాధి హామీ ఉద్యోగులు పేర్కొన్నారు. గురువారం వీర్నపల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధి శాఖలో పని చేస్తున్న సెర్ప్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ పేస్కేల్ ప్రకటించి, అదే శాఖలో పనిచేస్తున్న ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా క్రమబద్ధీకరణ పేస్కేల్ ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ గొడిసెల రమేశ్, ఏజేసీ కార్యదర్శి నలిమెట నాగరాజు, శ్రీనివాస్, ఏపీవో నాగరాజు, శ్రీహరి, హర్షద్ పాషా, అహ్మద్, ఉపాధి హామీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు మండల సమావేశం

వీర్నపల్లి: జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మాలోత్ భూల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో నరేశ్ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

వేములవాడ: వేములవాడ పట్టణంలోని వాసవీనగర్, మొదటి బైపాస్‌రోడ్డు, గాంధీనగర్, మార్కెట్ ఏరియా, మున్నూరు కాపు సత్రం, అంబేడ్కర్ నగర్, ముదిరాజ్ వీధి, మేయిన్ రోడ్డు, మోచీవాడ, మహాలక్ష్మివీధి, ఉప్పుగడ్డ, సుబాష్‌నగర్, ఓల్డ్ అర్బన్‌కాలనీ, తిప్పాపూర్, అయ్యోర్‌పల్లి ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు సెస్ ఏఈ సుష్మతెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

11న లోక్ అదాలత్

బోయినపల్లి: వేములవాడ కోర్టు జడ్జి ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని లోక్ అదాలత్ సభ్యుడు చెన్నమాధవుని రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగ సమాచారం

డాక్టర్ కావలెను

సిరిసిల్ల: జిల్లాలో ఒక డాక్టర్ పోస్టు భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం పథకంలో మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫిబ్రవరి 15లోగా దరఖాస్తులు కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆఫీస్‌లో సమర్పించాలని కోరారు.

నియామకం

బంజారా సేవా సంఘం అధ్యక్షుడిగా నర్సింలు నాయక్

ముస్తాబాద్: మండల బంజరా సేవా సంఘం అధ్యక్షుడిగా సేవాలాల్ తండాకు చెందిన లకావత్ నర్సింలు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముస్తాబాద్‌లో గురువారం జరిగిన గిరిజన సమావేశంలో ఎన్నికలను నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా భూక్య సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా భూక్య మోహన్, కోశాధికారిగా రమావత్ చందునాయక్, గౌరవ అధ్యక్షుడిగా లకావత్ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుగులోత్ రమేశ్ నాయక్ ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ గ్రామ శాఖ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్ కాంగ్రెస్ గ్రామ శాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తెలిపారు. అధ్యక్షుడిగా రోండ్ల రాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా లింగంపల్లి సత్యం, కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజునాయక్ నాయకులు పాల్గొన్నారు.

సెస్ గ్రామ ప్రతినిధులు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణ సెస్ ప్రతినిధులుగా సీహెచ్ వెంకట్‌యాదవ్, వాసాలమర్రి గోపిని గురువారం ఏకగ్రీవంగా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నామాల ఉమ, సెస్ ఏఈ సుష్మా పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని మల్లుపల్లి సెస్ గ్రామ ప్రతినిధిగా మరాఠి రవికుమార్ ఎన్నికయ్యారు. అదేవిధంగా ముస్తఫానగర్ గ్రామ ప్రతినిధులు బండ ప్రభాకర్, చిలుక అంజయ్య ఎన్నికయ్యారు.

ఇల్లంతకుంట: మండలంలోని వంతడుపుల గ్రామ సెస్ ప్రతినిధులుగా ఎన్నికైన కొమ్మెర రాజిరెడ్డి, దుర్శెట్ల శ్రీనివాస్ ఏకగ్రీవం కాగా సెస్ ప్రతినిధులను వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, సర్పంచ్ కట్ట వెంకట్‌రెడ్డి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, యాదగిరి, శేఖర్, లచ్చయ్య, నర్సయ్య, తదితరులున్నారు.

వీర్నపల్లి: మండలం బంజేరు సెస్ గ్రామ ప్రతినిధులుగా కోలపాక అనిల్, గుగులోత్ పకీరా, వన్‌పల్లి ప్రతినిధులుగా శాడ పెద్ద మల్లారెడ్డి, లక్ష్మణ్‌నాయక్ ఎన్నికయ్యారు.

బీసీ జనగణన చేయాలని సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

ఇల్లంతకుంట: బీసీ రిజర్వేషన్ 27 శాతం నుంచి 52 శాతంకు పెంచాలని బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా కార్యదర్శి ఏనుగుల లింగన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీ జనగణన చేసి 27 శాతం ఉన్న రిజర్వేషన్లను 52 శాతానికి ఖచ్చితంగా పెంచాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచేంత వరకు బీఎస్పీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిలుకపెల్లి ప్రవీణ్, పర్శరాం, రాజమల్లు, గజ్జెల సత్తయ్య, జాన్, రాజ్‌కుమార్, శశికుమార్, రామన్న, ఆదర్శ్, కనుకయ్య పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



రామన్నపేటలో ప్రారంభించిన ఎంపీడీవో

చందుర్తి: మండలంలోని రామన్నపేట గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీవో రవీందర్, గ్రామ సర్పంచ్ దుమ్ము అంజయ్య గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెల్పుల వనజ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

సిరిసిల్లఅర్బన్: రాజన్న సిరిసిల్ల జిల్లా ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ 2023 క్యాలెండర్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, డీవైఎస్‌వో ఉపేందర్‌రావు, టౌన్ సీఐ అనిల్‌కుమార్, పెటా అధ్యక్షుడు దేవత ప్రభాకర్, జనరల్ సెక్రటరీ సానబాబు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర బడ్జెట్‌లో పేస్కేలు వర్తింపచేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంపై సెర్ప్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి అభిమానాన్ని చాటారు. 23 ఏళ్లుగా చాలీచాలని వేతనాలు, భద్రత లేని ఉద్యోగాలు చేస్తున్న తమ సమస్యలను సీఎం కేసీఆర్ అర్థం చేసుకుని పేస్కేలు వర్తింపజేశారని కొనియాడారు. కార్యక్రమంలో జేఏసి నాయకులు సూదుల రాజు, కడం చంద్రయ్య, శోభారాణి, జ్యోతి, రవికుమార్, సుధారాణి, సెర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం రూ. వెయ్యి నుంచి రూ.3 వేలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి సంతోష, మండల శాఖ అధ్యక్షురాలు వనిత, బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, పట్టణ శాఖ అధ్యక్షుడు వెంకటి యాదవ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లింగంయాదవ్, ముదిరాజ్ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పిట్ల శ్రీమతి, సెస్ గ్రామ ప్రతినిధి సిరిపురం అంజయ్య, రాగిశెట్టి నారాయణ, ఆనందం పాల్గొన్నారు.

నిజాయితీగా ఉండి నీతులు చెప్పాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పడిగెల మానస

తంగళ్లపల్లి: సిరిసిల్ల నియోజకవర్గ బీజేపీ పాలక్‌గా వ్యవహరిస్తున్న రాణి రుద్రమ ముందు తాను నిజాయితీతో ఉంటూ ఇతర పార్టీల నాయకులకు నీతులు చెప్పాలని ఎంపీపీ పడిగెల మానస హితవు పలికారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడుతూ బీజేపీ నాయకులు రుణాలు తీసుకుని బ్యాంకులకు కుచ్చుటోపీలు పెట్టడం, బ్యాంకు రుణాల ఎగవేతదారులకు అండగా నిలవడం పరిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్మును బ్యాంకుల నుంచి రూ.18 కోట్లు అప్పుల రూపంలో పొంది వాటిని ఎగ్గొట్టేందుకు ప్రయత్నించి చివరికి ఆస్తులు కూడా వేలం వేసే స్థితికి రాణి రుద్రమ దిగజారిందని విమర్శించారు. మీ వ్యవహారాలన్ని సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు. మంత్రి కేటీఆర్‌పైన అవాకులు చెవాకులు పేలడం కాదు, మందు బ్యాంకులకు ఎగ్గొట్టిన రుణాలను తీర్చి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు మోర నిర్మల, సింగిల్ విండో చైర్మన్ ఎగుమామిడి రమణా రెడ్డి, మాజీ సర్పంచ్ కోడం సంధ్యారాణి, అర్కుటి మహేశ్, నాయకులు బండి జగన్ పాల్గొన్నారు.

మృతుడి కూతుళ్ల పేరిట నగదు డిపాజిట్



డిపాజిట్ పత్రాలను అందిస్తున్న తోట ఆగయ్య

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ ఈసంపల్లి హేమ భర్త, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్ ఇటీవల మృతిచెందారు. వీరి ఇద్దరు కూతుళ్ల పేరిట చెరో రూ:2.50 లక్షలు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్, మంత్రి కేటీఆర్ బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. గత నెల 30న బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి ఆర్థికసాయం చేస్తానని మాట ఇచ్చారు. సదరు బ్యాంక్ డిపాజిట్ పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి గురువారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల చేతుల మీదుగా హేమకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, ఎంపీపీ మాలోత్ భూల, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పుస్తె మెట్టెలు అందజేత



పుస్తె మెట్టెలు అందజేస్తున్న బండారి బాల్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన నిరుపేద దళిత కుటుంబానికి ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి గురువారం పుస్తెమెట్టెలను అందజేశారు. గురువారం ఏర్పుల శంకర్ బాలమణి దంపతుల కూతురు రజిని వివాహానికి బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి హాజరై పుస్తెమట్టెలను అందజేశారు. వార్డు సభ్యులు పందిర్ల శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యకు దూరం

- క్రీడా పరికరాలకు నిధులున్నా పీఈటీలు లేని పాఠశాలలెన్నో
- తరగతి గదికే పరిమితం.. ఆటలకు దూరం
- 11 ఉన్నత పాఠశాలల్లో ముగ్గురే పీఈటీలు



నర్సింగపూర్ పాఠశాలలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

చందుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు వ్యాయామ విద్యకు దూరమవుతున్నారు. చదువుతోపాటు వ్యాయమ విద్యకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని చెప్పుకోవడమే తప్పా క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

11 ఉన్నత పాఠశాలల్లో ముగ్గురే పీఈటీలు

మండలంలో 11 జెడ్పీహెచ్‌ఎస్‌లు ఉన్నాయి. వీటిలో నాలుగు పోస్టులు మాత్రమే ఉన్నాయి. వీటిలో ఒకటి ఖాళీగా ఉండగా , మిగతా పోస్టులు నర్సింగపూర్, చందుర్తి, మూడపల్లి పాఠశాలలు పీఈటీలు ఉన్నారు. మల్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో పోస్టు ఖాళీగా ఉంది. మిగతా 7 పాఠశాలలకు పోస్టులు కూడా ప్రభుత్వం కేటాయించలేదు. దీంతో ఆయా పాఠశాలల విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు. ఉన్నత పాఠశాలల్లో 1,343 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. చాలా పాఠశాలల్లో 130 పైగా విద్యార్థులున్నారు. కనీసం విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలను గుర్తించి పీఈటీ పోస్టులను ఆయా పాఠశాలలకు కేటాయిస్తే. వారికి న్యాయం జరుగుతుందన్న అభిప్రాయాన్ని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులే వ్యక్తం చేస్తున్నారు.

మల్యాల పాఠశాలలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు

మండలంలోని మల్యాల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 210 మంది ఉన్నారు. పాఠశాలలో చాలా మంది విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం ఉన్న పీఈటీ లేక ఆటల్లో రాణించ లేకపోతున్నారు. 2012 నుంచి 2020 వరకు వ్యాయమ ఉపాధ్యాయుడి పోస్టు ఖాళీగా ఉంది. 2020–21 విద్యా సంవత్సరంలో పీఈటీని కేటాయించారు. 317 జీవోతో గత సంవత్సరం ఉన్న పీఈటీ బదిలీపై వెళ్లగా ప్రస్తుతం ఖాళీగా ఉండడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఉన్న పోస్టుల్లో 317 జీవోతో బదిలీ కాగా, ఆ స్థానంలో పీఈటీలను కేటాయించాల్సిన అధికారులు ఖాళీగా ఉన్న పాఠశాలలకు కేటాయించారు. మండలంలో అన్ని పాఠశాలల కన్న ఎక్కువగా విద్యార్థులు ఉన్న పోస్టు కేటాయిచకపోవడం పట్ల ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో గ్రామ సర్పంచ్ ఆవేదనను వ్యక్తం చేశారు.

క్రీడా పరికరాల కొనుగోలుకు నిధులు

ఉన్నత పాఠశాలల్లో వ్యాయమ ఉపాధ్యాయులు లేనప్పటికీ మండలంలోని పాఠశాలన్నింటికీ ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఉన్నత పాఠశాలలకు, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.10 వేల చొప్పున, 11 ఉన్నత పాఠశాలలకు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.10 వేల చొప్పున కేటాయించింది. ప్రాథమిక పాఠశాలలకు రూ.5 వేల చొప్పన ఆయా పాఠశాల ఖాతాల్లో ప్రభుత్వం రూ.2.70 లక్షలు జమ చేసింది. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో క్రీడా వస్తువులను కొనుగోలు చేశారు.

ఆటలకు దూరం.. భవిష్యత్ ప్రశ్నార్థకం

ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో క్రీడాకారులకు ప్రత్యేక కోటా ఉండడంతో పాఠశాలలకు వ్యాయామ ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులను సరైన రీతిలో శిక్షణతో రాణించేందుకు కృషి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పీఎంజేజేవై బీమాను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు పంపిణీ చేస్తున్న బ్యాంక్ మేనేజర్

ఎల్లారెడ్డిపేట: పీఎంజేజేవై ఇన్సురెన్స్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర సహకార బ్యాంక్ మేనేజర్ సంపూర్ణ కోరారు. గురువారం పలువురు లబ్ధిదారులకు బీమా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నరేశ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ఎల్లారెడ్డిపేట: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, కార్యదర్శి స్వామిగౌడ్, నాయకులు సంతోష్‌గౌడ్, శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పాత పెన్షన్‌ను పునరుద్ధరించే అధికారం రాష్ట్ర పరిధిలో ఉంటుందని, కేంద్రం జోక్యం చేసుకుంటే తాము ఊరుకునేది లేదని హెచ్చరించారు.

పరామర్శ

బోయినపల్లి: అనారోగ్యంతో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు జంకె మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులను జిల్లా టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి గురువారం పరామర్శించారు.

ప్లాస్టిక్ నిషేధం అమలుపై టాస్క్‌ఫోర్స్ కమిటీ

ముస్తాబాద్: మండలంలోని సంపూర్ణ పారిశుధ్యం, ప్లాస్టిక్ నిషేధం అమలుపై టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. ప్రతి 5, 15వ తేదీల్లో కమిటీ సభ్యులు తమకు కేటాయించిన గ్రామాల్లో పర్యటించి, పారిశుధ్య నిర్వహణ, ప్లాస్టిక్, వ్యర్థాలను ఆరుబయట పడవేయకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. పారిశుధ్య నియంత్రణ, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కమిటీలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుకన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరవింద, కళావతి టీం లీడర్లుగా, సెర్ప్, సీఆర్‌పీలు ఇతర సభ్యులుగా ఉంటారన్నారు.

బీరప్ప ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

కోనరావుపేట: మండలం కొలనూర్‌లో జరుగుతున్న బీరయ్య కామరాతి కల్యాణోత్సవాల్లో గురువారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఎట్టిముల్లెలు మోసే కార్యక్రమాలను, పూజ కథలను ప్రదర్శించారు. కార్యక్రమాలకు మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ తదితరులు హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం బాధ్యులు వీరవేణి తిరుపతి, దేవేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు

ఎల్లారెడ్డిపేట: మండలం బాకూర్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు బొప్పాపూర్‌కు చెందిన మొదుసు బాల్‌రెడ్డి స్కూల్ బ్యాగులు వితరణ చేశారు. పాఠశాల సంక్షేమ నిధికి రూ.లక్ష 40 వేలు జమ చేశారు.

ఉచిత పశువైద్య శిబిరం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామంలో వేములవాడ ఏఎంసీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువులకు అవసరమున్న మందులను రైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రభాకర్‌రావు, మండల పశువైద్యాధికారి ప్రశాంత్‌రెడ్డి, సర్పంచ్ ఇటుకల నవీనరాజు, ఎంపీటీసీ బుర్ర లహరిక, మాజీ సర్పంచ్ మల్లేశం, ఏఎంసీ డైరెక్టర్లు గుండెకార్ల నరేశ్, బండారి శ్రీనివాస్ పాల్గొన్నారు.